క్లుప్తంగా

ఘనంగా గోమాతకు అంత్యక్రియలు



తాడేపల్లి రూరల్ : మంగళగిరి మండల పరిధిలోని రామచంద్రాపురంలో గోమాతకు శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ లంకిరెడ్డి శేషిరెడ్డి గత 38 ఏళ్లుగా గోవును పోషిస్తున్నారని తెలిపారు. తన జీవిత కాలంలో 17 సార్లు ఈనినట్లు పేర్కొన్నారు. రామచంద్రాపురం పరిసర ప్రాంతాల్లో దేవత ప్రతిష్టలు, గృహ ప్రవేశాలకు తీసుకు వెళ్లేవారని తెలిపారు. గోమాతకు పూజలతో, బాజా భజంత్రీలతో ఊరేగింపు నిర్వహించి భూస్థాపితం చేసినట్లు చెప్పారు.

పార్టీ కమిటీలను వెంటనే పూర్తి చేయాలి



మంగళగిరి: నియోజకవర్గ అనుబంధ సంఘాల కమిటీలను వెంటనే నియమించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గుంటూరు, పల్నాడు జిల్లాల అనుబంధ విభాగాల ఇంచార్జ్ షేక్ మస్తానవలి సూచించారు. శనివారం మండలంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త వేమారెడ్డిని కలిశారు. ఇప్పటికే నియోజకవర్గ, మండల స్థాయి, అనుబంధ సంఘాల విభాగాల అధ్యక్షులు నియామకాలు పూర్తి చేశామని ఆయన తెలిపారు. త్వరలో జిల్లా, మండల అనుబంధ విభాగాల కమిటీలను పూర్తి చేస్తామని వేమారెడ్డి తెలిపారు.

రైతులకు 'అన్నదాత సుఖీభవ' చెక్కు పంపిణీ



దుగ్గిరాల: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు నిలబెట్టుకుంటోందని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. దుగ్గిరాల పసుపు యార్డులో శనివారం అన్నదాత సుఖీభవ పథకం మెగా చెక్కుని రైతులకు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, శాసన మండలి సభ్యులు సోము వీర్రాజు హాజరయ్యారు.నియోజకవర్గంలోని 13,483 రైతులకు గానూ రూ 9.85 కోట్ల మెగా చెక్కును అందించారు. కార్యక్రమానికి వ్యవసాయ అధికారి ఆర్.విజయబాబు అధ్యక్షత వహించారు. అనంతరం మంగళగిరి కార్యక్రమంలో యార్డు చైర్మన్ వి.ఝాన్సీరాణి, ఎంపీపీ షేక్ జబీన్, యార్డు సెక్రెటరీ జె.వి.సుబ్బారావు, తహ సీల్దారు ఐ.సునీత, ఎంపీడీవో ఎ.శ్రీనివాస రా వు, రైతులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి



తాడేపల్లి రూరల్: కూటమిప్రభుత్వం ఏసీసీ కార్మికుల సమస్యపై దృష్టి సారించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు విజ్ఞప్తి చేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో శనివారం కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి, మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు 242 రోజులుగా దీక్షలు చేస్తున్నా, ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమని ఖండించారు. యాజమాన్యంతో చర్చలు జరిపి కార్మికులకు న్యాయంగా రావాల్సిన బకాయిలను ఇప్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.స్టీవెన్, కమిటీ సభ్యులు వై. సాంబశివరావు, నాయకులు ఆశీర్వాదం, సుబ్బారావు, సూర్యప్రకాశరావు, ఆదినారాయణ, కార్మికులు అంకయ్య, వై. రమాదేవి, దుర్గాభవాని, కాసమ్మ, గురవయ్య పాల్గొన్నారు.

ఆశీలను రద్దు చేయాలి

తాడేపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆశీలను వెంటనే రద్దు చేయాలని రాష్ట్ర చేతి వృత్తిదారుల సంఘం నాయకులు కంచర్ల కాశయ్య డిమాండ్ చేశారు. తాడేపల్లిలో శనివారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో చేపల విక్రయదారుల వద్ద వారానికి యాభై రూపాయలు వసూలు చేశారని, అప్పటి శాసన సభ్యులు దాన్ని రద్దు చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నారా లోకేష్ ఆశీల రద్దును కొనసాగిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే, ఇప్పుడు రూ. 100 వసూలు చేయడంతో వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. మంత్రి లోకేష్ వెంటనే స్పందించి ఆశీలను రద్దు చేయాలని ఆయన కోరారు.

'స్మార్ట్'గా దోచేస్తున్న కూటమి ప్రభుత్వం

- నెలకు రూ.800 నుంచి రూ. 1600 పెరిగిన బిల్లులు
- స్మార్ట్ మీటర్లు వద్దంటూ అడ్డుకుంటున్న ప్రజలు



ఇటీవల బిగించిన స్మార్ట్ మీటర్



ఫిరంగిపురంలో అవగాహన కల్పిస్తున్న సీపీఎం మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి

మంగళగిరి: విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఇప్పటికే ప్రభుత్వం వాణిజ్య సంస్థలకు బిగించింది. ప్రజలలో అవగాహన కల్పించకుండానే ఇష్టానుసారం గత మీటర్ల స్థానంలో కొత్తగా ఇళ్లకు బిగిస్తున్నారు. మీటర్ల సిబ్బందికి శిక్షణ ఇచ్చి బిగిస్తున్నారు. స్మార్ట్ మీటర్లు బిగించిన అనంతరం బిల్లులో తేడాలు రావడం వినియోగదారులను ఆందోళనకు గురి చేస్తోంది. గతంలో రూ. 800 వచ్చే బిల్లు ప్రస్తుతం రూ. 1600 రావడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై సిబ్బందికి శిక్షణ ఇచ్చిన అధికారులు ప్రజలకు అవగాహన కల్పించడంలో మాత్రం శ్రద్ధ చూపడం లేదు.

పెరిగిన బిల్లులతో లబోదిబో

ఇప్పటికే వాణిజ్య, వ్యాపార సంస్థలలో స్మార్ట్ మీటర్లు బిగింపు పూర్తయింది. ఉదాహరణకు పాత బస్టాండ్ సెంటర్‌లోని ఓ దుకాణంలో పాత మీటరు ఉన్నప్పుడు ప్రతి నెలా రూ.1200 నుంచి రూ. 1500బిల్లు వచ్చేది. వాణిజ్య సంస్థ పేరుతో స్మార్ట్ మీటరు బిగింపుతో ప్రస్తుతం నెలకు రూ 800 నుంచి రూ.1000 వరకు అదనంగా విద్యుత్ బిల్లు వస్తుందని దుకాణదారుడు వాపోయాడు.

గతంలో వచ్చే బిల్లులకు అదనంగా బిల్లులు వస్తుండడంతో ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. పట్టణంలోని పలుప్రాంతాలలో స్మార్ట్ మీటర్లు తమకు బిగించవద్దంటూ విద్యుత్ సిబ్బందిని అడ్డుకుంటున్నారు. దీంతో చేసేదేమి లేక సిబ్బంది వెనుతిరిగి వెళ్లి అధికారులుకు తెలియజేస్తున్నారు.

ఫిరంగిపురంలో..

ప్రతి ఒక్కరూ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని సీపీఎం మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారి, కొత్తపేట, బ్యాంకు సెంటర్, సత్తెనపల్లి రోడ్డు, రసూల్‌పేట ప్రాంతాల్లో సీపీఎం మండ లశాఖ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికీ వెళ్లి స్మార్ట్ మీటర్ల వలన కలిగే ఇబ్బందులు తెలియజేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మస్తాన్‌వలి మాట్లాడుతూ ప్రజలపై విద్యుత్‌భారం పెంచేలా స్మార్ట్ మీటర్లు పని చేస్తాయని తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 5న నిర్వహించన్ను ఆందోళన కార్యక్రమంలో ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు. అనంతరం ప్రజలకు కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నేత జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో..

పేదలపై మరింత విద్యుత్ భారాలు వేయడానికి స్మార్ట్ మీటర్లు బిగుస్తున్నారని సీపీఎం కార్మిక సంఘ నాయకులు జెట్టి బాలరాజు అన్నారు. మండలంలోని పెదకొండూరు, పెనుమూలి గ్రామాలలో కరపత్రాలు ద్వారా శనివారం ప్రచారం చేశారు. ప్రజానీకానికి ఉరి తాళ్లుగా మారనున్న స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నేతలు వై.పోతురాజు, వై.బ్రహ్మయ్య, బాబు, కృష్ణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్‌లో..

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని పిలుపునిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో నేతలు శనివారం ఉండవల్లిలో కరపత్రాల పంపిణీ చేశారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతంలో స్మార్ట్ మీటర్లు పెడితే పగలకొట్టమని చెప్పిన కూటమి ప్రభుత్వం నేడు బిగించడం ఏమిటని ప్రశ్నించారు. నులకపేటలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఈనెల 5వ తేదీన జరిగే ధర్నాలో వినియోగదారులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కె. బాబూరావు, కె. మేరి, ఆంజనేయులు, కాళిదాసు పాల్గొన్నారు.

తాడికొండలో..

ప్రజలకు పెను భారంగా మారే స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని రాజధాని సీఐటీయూ రాజధాని డివిజన్ కమిటీ అధ్యక్షుడు ఎం. రవి పిలుపునిచ్చారు. తుళ్లూరులో శనివారం విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఆగస్టు 5, 6 ,7 తేదీల్లో విద్యుత్, ప్రభుత్వ కార్యాలయాల ఎదుట జరపనున్న నిరసనల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ రాజధాని డివిజన్ నాయకులు పేరం బాబూరావు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగిస్తే ఊరుకోం !

తాడేపల్లి రూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని ఆంజనేయ కాలనీలో ఇంటికి స్మార్ట్ మీటర్ బిగించడానికి వచ్చిన సిబ్బందిని సీపీఎం నాయకులు శనివారం అడ్డుకున్నారు. మీటర్లు బిగిస్తే ఊరుకోమని తేల్చి చెప్పారు. స్మార్ట్ మీటర్లు బిగించిన తరువాత నెలకు రూ. 150 చొప్పున 93 నెలలు వసూలు చేస్తారని వినియోగదారుడికి వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వేల కోట్ల రూపాయల విద్యుత్ బిల్లులు పెంచినట్లు విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పిల్లలమర్రి బాలకృష్ణ టి. వేమ



ఆంజనేయ కాలనీలో సిబ్బందిని అడ్డుకుంటున్న నాయకులు

సుందరరావు, కె. వెంకటేశ్వరరావు, డి. రామారావు పాల్గొన్నారు.

భక్తులకు నిలువ నీడ కరువు

- వెంకటపాలెం టీటీడీ ఆలయానికి పెరుగుతున్న తాకిడి
- భక్తులకు తప్పని అవస్థలు

తాడికొండ: రాజధాని అమరావతి ప్రాంతంలోని వెంకటపాలెం టీటీడీ ఆలయంలో భక్తులకు అవస్థలు తప్పడం లేదు. ఆలయ నిర్మాణం అనంతరం భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో టీటీడీ సిబ్బంది విఫలమవుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్యూ లైన్లలో నిలబడేందుకు కూడా కనీస సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. శనివారం ఆలయానికి భక్తులు క్యూ కట్టడంతో లైన్లలో నిలబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎండవేడిమి తాళలేక పలువురు వృద్ధులు, మహిళలు నానా అవస్థలు పడ్డారు. సంబంధిత అధికారులు స్పందించి భక్తులకు సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు. అన్నదానం కోసం వేసిన షెడ్డు మినహా మరేది లేకపోవడంతో భక్తులకు అవస్థలు తప్పడం లేదు. దాతల సహకారం పేరుతో వసూలు చేసిన విరాళాలలో గోల్‌మాల్ జరిగిందని వచ్చిన ఆరోపణల మేరకు టీటీడీ విజిలెన్స్ విభాగం అధికారులు నిత్యాన్నదానం, ఇతర విరాళాలపై విచారణ చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి భక్తులకు సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.



క్యూలైన్‌లో నిలబడి ఎండకు ఇబ్బందులు పడుతున్న భక్తులు

సాక్షి టీవీ ప్రసారాలు నిలిపివేయడం ప్రభుత్వ పిరికితనం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి: ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలను వెలుగులోకి తెస్తున్న సాక్షి టీవీ ప్రసారాలు నిలిపివేయడం ప్రభుత్వ పిరికితనం అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి మండిపడ్డారు. మండలంలోని ఆత్మకూరులో గల పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సత్యాన్ని వెలికితీసే సాక్షి టీవీ ప్రసారాలను ఆపడం సరికాదని తెలిపారు. సిటీ కేబుల్, యాక్ట్, వీ డిజిటల్, ఎంఎస్‌వోలతో వేమారెడ్డి ఫోన్‌లో మాట్లాడారు.ప్రభుత్వ ఒత్తిడితోనే సాక్షి టీవీ ప్రసారాలు ఆపినట్లు ఎంఎస్‌వోలు ఆయన దృష్టికి తెచ్చారు. సాక్షి టీవీ ప్రసారాలు పునరుద్ధరించకపోతే బిల్లులు చెల్లించమని వేమారెడ్డి తెలిపారు. ఏ హక్కుతో సాక్షి టీవీ ప్రసారాలు నిలిపేశారని ఆయన నిలదీశారు. ప్రసారాలనను వెంటనే పునరుద్ధరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

బాలోత్సవం ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలను నిర్వహిస్తున్నట్లు బాధ్యులు గాది సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని వివిధ పాఠశాలల్లో హెచ్ఎంలకు బ్రోచర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 10వ తేదీ ఆదివారం తాడేపల్లి బైపాస్ రోడ్‌లోని అమరావతి ఐకాన్‌లో చిత్రలేఖనం పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. 3,4,5 తరగతుల వారిని సబ్ జూనియర్‌గా, 6,7 తరగతుల వారిని జూనియర్‌గా, 8,9,10 తరగతుల వారిని సీనియర్ విభాగాలుగా విభజించి పోటీలను నిర్వహిస్తామని వివరించారు. పోటీల్లో పాల్గొన దలచిన వారు ఈనెల 7వ తేదీలోపు పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తామని పేర్కొన్నారు. పోటీ కేంద్రంలో కేవలం డ్రాయింగ్ షీటు మాత్రమే అందజేస్తామని, మిగిలిన సామగ్రిని విద్యార్థులే తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మంగళగిరి తాడేపల్లి బాలోత్సవ బాధ్యులు ఎం. మనోహర్ రెడ్డి, బిత్రా రామారావు పాల్గొన్నారు.



పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి బ్రోచర్ అందజేస్తున్న గాది సుబ్బారెడ్డి

రైతులంతా అప్రమత్తంగా ఉండాలి

వడ్డేశ్వరంలో కేఎల్‌యూ విద్యార్థుల అవగాహన కార్యక్రమం

తాడేపల్లి రూరల్: కేఎల్ వ్యవసాయ కళాశాల, బీఏ ఐఎఎస్, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో శనివారం వడ్డేశ్వరంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వ్యవసాయ కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి. రత్నప్రసాద్ మాట్లాడుతూ నైరుతి రుతుపవనాల కారణంగా బలమైన ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో పిడుగులు పడే ప్రమాదం ఉందని తెలిపారు. వ్యవసాయ భూముల్లో ఉన్న రైతులు అప్రమత్తంగా ఉండాలిని సూచించారు. పిడుగులు పడే సమయంలో చెట్లు, స్తంభాల కింద నిలబడరాదని పేర్కొన్నారు. వ్యవసాయ కళాశాల విభాగాధిపతి బి. బాలకృష్ణ, బీఏ ఐఎఎస్ విభాగాధిపతి బి. శివనాగయ్య మాట్లాడుతూ పిడుగులు పడే సమయంలో రెండు పాదాల వేళ్లు మాత్రమే నేలను తాకేలా మోకాళ్లపై వంగి కూర్చుకోవాలని, కళ్లు మూసుకుని చేతులను చెవులు మూసివేసి తలపై పెట్టుకుంటే కొంత రక్షణ పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ ఫీల్డ్ కో- ఆర్డినేటర్ పి. సురేష్, అధ్యాపకులు కిరణ్, వెంకటేశ్వర్లు, వలంటీర్లను వర్సిటీ ప్రో వీసీలు ఏవీఎస్ ప్రసాద్, ఎన్. వెంకట్రామ్, కె. రాజశేఖరరావు, రిజిస్ట్రార్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి కె.ఆర్.ఎస్. ప్రసాద్, సలహాదారు హబీబుల్లా ఖాన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో- ఆర్డినేటర్ పి. శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

ఓట్లు వేయించుకొని కూటమి ప్రభుత్వం మోసం

జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణ

దుగ్గిరాల: ప్రజలతో ఓట్లు వేయించుకొని, ఇచ్చిన హామీలు అమలు చేయలేక కూటమి ప్రభుత్వం మోసం చేసిందని దుగ్గిరాల జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణ అన్నారు. దుగ్గిరాల మండలంలోని ఈమనిలో శనివారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు, చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. పొరపాటున ఓటు వేసినందుకు ప్రతి ఒక్కరికీ ఐదు సంవత్సరాలు ఇబ్బందులు తప్పవని తెలిపారు.18 సంవత్సరాలు దాటిన మహిళకు నెలకు రూ.1500 ఇస్తామన్న కూటమి ప్రభుత్వం, నేడు ఆ పథకం అమలు చేయాలంటే ఆంధ్రప్రదేశ్ అమ్మాలి అని బాధ్యత కలిగిన మంత్రి అనడం బాధాకరమని తెలిపారు. కూటమి ప్రభుత్వం మంచి చేయడం మానేసి అరాచకాలు, అక్రమాలకు పాల్పడుతోందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ నాయకులపై దౌర్జన్యాలు, దాడులు చేస్తూ అక్రమ కేసులు పెడుతోందని తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు టి.శివగోపయ్య, ఎ.ధనుంజయ్, చిలువూరుఫిలోమణి, పి.ధర్మరత్నం, ఎ.నాగరాజు, జె.గోపయ్య, కె.ఏసుపాదం, జి.లోకేష్, కాంతారావు, శ్రీనివాసరావు, టి.శ్రీనివాసరావు, మండే మనోజ్ పాల్గొన్నారు.



క్యూఆర్ కోడ్‌ని ప్రదర్శిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణ, నేతలు

బిడ్డకు తల్లిపాలే బలం.. శ్రేష్టం

ఫిరంగిపురం: పుట్టిన ప్రతి బిడ్డకు తల్లి పాలు తాగించడం ఎంతో శ్రేష్టమని ఎంఎల్‌హెచ్‌పీ లింగరాజు తెలిపారు. మండలంలోని మునగపాడు బీసీ–2 అంగన్‌వాడీ సెంటర్లో శనివారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. లింగరాజు మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు తాగించడం ద్వారా వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. మెదడు అభివృద్ధి చెంది మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉంటాడని చెప్పారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ చిన్నమ్మాయి, ఏఎన్ఎం అరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మేడికొండూరులో...

పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు పట్టిస్తే వ్యాధినిరోధకశక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని డోకిపర్రు అంగన్‌వాడీ కేంద్రం వద్ద శనివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అప్పుడే పుట్టిన పిల్లలకు తల్లిపాలు అందించడమే మొట్టమొదటి టీకాగా భావించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్ఎం స్వప్న, ఎంపీయూపీ పాఠశాల హెచ్ఎం నాగేశ్వరరావు, నోసిన కోటేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్‌లో..



ఫిరంగిపురంలో అవగాహన కల్పిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ లింగరాజు

తాడేపల్లి రూరల్‌పరిధిలోని పెనుమాక, ఉండవల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ సెక్టార్ సూపర్ వైజర్ సీహెచ్. శిరోమణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తల్లులు అంతా తప్పనిసరిగా బిడ్డకు పాలు ఇవ్వాలని సూచించారు.

పాలు ఇవ్వడం వల్ల తల్లి క్యాన్సర్ బారిన పడకుండా ఉండవచ్చని వివరించారు. పిల్లల్లో తెలివితేటలు, సామర్థ్యాలు మెరుగుపడతాయని తెలిపారు. శిశువు జన్మించిన వెంటనే ముర్రిపాలు తాగించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రాజేశ్వరి, అంగన్‌వాడీ హెల్పర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాతున్న ఈమని వైద్యాధికారి ఎ.శ్రీవల్లి

దుగ్గిరాలలో..

తల్లిపాలు శిశువుకి ఇచ్చే తొలి టీకా అని, మెదడు ఎదుగుదలకు, శిశువు వ్యాదినిరోధకశక్తిని అదించడానికి తోడ్పడతాయని ఈమని వైద్యాధికారి ఎ.శ్రీవల్లి తెలిపారు. మండలంలోని చిన్నపాలెం, పేరుకలపూడి, పెదకొండూరు, చుక్కవల్లివారిపాలెం, శృంగారపురం, వీర్లపాలెం, చింతలపూడి, ఈమని గ్రామాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. వైద్యాధికారి శ్రీవల్లి మాట్లాడుతూ తల్లిపాలలో ప్రొటీన్స్, కార్బోహైడ్రేట్స్, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా శిశువుకి లభిస్తాయని తెలిపారు. నిమోనియా నుంచి రక్షణ పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రెహమున్నీసా, ఏఎన్ఎంలు, ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సమస్యపై ప్రశ్నిస్తే దాడి చేస్తారా?

దుగ్గిరాల జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ

తాడేపల్లి రూరల్: అంబేడ్కర్ రాజ్యాంగం బదులు ఆంధ్రప్రదేశ్‌లో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని దుగ్గిరాల జెడ్పీటీసీ సభ్యురాలు అరుణ అన్నారు. ప్రజలు, రైతు సమస్యలపై మాట్లాడితే కూటమి ప్రభుత్వం వారిని ఏదో విధంగా ఇబ్బందులకు గురి చేస్తూ దాడులకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. దుగ్గిరాలలోని ఆమె కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంతో పాటు చుట్టుపక్కల ఉన్న పంట కాలువలు, డ్రైనేజీలు తూటాకు, గుర్రపు డెక్కతో నిండిపోయాయన్నారు. వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త అశోక్‌బాబు డ్రైనేజీలు, కాలువల్లో తూటాకు, గుర్రపు డెక్కను తొలగించాలని డిమాండ్ చేశారు. ఆగ్రహించిన ప్రభుత్వం పోలీసుల రూపంలో ఆయనపై దాడి చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వానికి ఎస్సీలంటే చిన్న చూపు అని, సాక్షాత్తు డెప్యూటీ సీఎం నియోజకవర్గంలో దళితులను వెలివేస్తూ అక్కడి అగ్రవర్ణాలు హుకుం జారీ చేస్తే ఇప్పటి వరకు ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. కాలువలు, డ్రైనేజీల్లో పేరుకుపోయిన తూటాకు, గుర్రపుడెక్క, వ్యర్థాలను వెంటనే ప్రభుత్వం తొలగించాలని మేకతోటి అరుణ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అశోక్‌బాబు చేస్తున్న నిరాహార దీక్షకు దళిత సంఘం నాయకులు, రైతులు మద్దతు తెలియజేస్తూ 'చలో వేమూరు' కార్యక్రమానికి పిలుపునిస్తామని ఆమె హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న అరుణ

ఎంపీటీసీ సభ్యులపై చిన్నచూపు తగదు !

తాడికొండ: అభివృద్ధి కార్యక్రమాల్లో తమకు సమాచారం ఇవ్వకుండా కేటాయింపులు చేసుకొని, కనీసం శంకుస్థాపనకు కూడా పిలవడం లేదని ఎంపీటీసీ సభ్యులు వాపోయారు. శనివారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారులపై మండిపడ్డారు. తన ఇంటి పక్కన సీసీ రోడ్డుకు శంకు స్థాపన చేస్తూ కనీస సమాచారం ఇవ్వలేదని తాడికొండ ఎంపీటీసీ సభ్యుడు ధూళిపాళ్ల నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. కంతేరులో దళిత మహిళా ఎంపీటీసీ సభ్యురాలికి కనీస గౌరవం కరువైందని, ఆమెను అక్రమంగా కేసులో ఇరికించి జైల్లో పెట్టారని, ఏ ప్రభుత్వ కార్యక్రమానికి సమాచారం ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస సమాచారం కూడా ఇవ్వకపోకవడం దుర్మార్గం కాదా? అని ప్రశ్నించడంతో అధికారులు నీళ్లు నమిలారు. భోజనం చేసి, సంతకాలు పెట్టి వెళ్లడానికి తాము న్నామా.. గౌరవం లేదా ? అని మండిపడ్డారు. ఇకపై అలాంటివి జరగకుండా చూసుకుంటామని అధికారులు చెప్పడంతో శాంతించారు. 18 మంది ఎంపీటీసీ సభ్యులు వైఎస్సార్ సీపీకి ఉండగా ముగ్గురు మాత్రమే టీడీపీ సభ్యులు ఉన్నారు. అనంతరం మండల పరిషత్ సమావేశం సాదాసీదాగా నిర్వహించారు. ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీవో కె. సమతావాణి, తహసీల్దార్ మెహర్ కుమార్, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి

13న క్యాన్సర్ ఆసుపత్రి భూమిపూజ

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వెల్లడి

తాడికొండ: అమరావతిలో ఈ నెల 13వ తేదీన బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి సీఎం చంద్రబాబు నాయుడు భూమిపూజ చేయనున్నట్లు హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ వెల్లడించారు. తుళ్లూరు మండలంలో బసవతారకం ఆసుపత్రికి కేటాయించిన భూముల్లో నిర్మాణానికి సంబంధించిన పనుల పురోగతిని శనివారం ఆయన తన సన్నిహితులతో కలిసి పరిశీలించారు. సీఆర్డీయే అదనపు కమిషనర్ ప్రవీణ్ పనుల పురోగతిని వివరించారు. మహిళా సాధికారితకు పెద్దపీట వేస్తూ నిర్మించిన భగవంత్ కేసరి సినిమాకు జాతీయ అవార్డు రావడం సంతోషంగా ఉందని బాలకృష్ణ తెలిపారు. ఇకపై తాను తీయబోయే సినిమాల్లో సమాజానికి సంబంధించిన మంచి సందేశాలు ఉంటాయని చెప్పారు.

అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

మంగళగిరి: నగరంలో అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు కమిషనర్ ఆలీం బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 30వ తేదీ, 6వ నెల 2025కు ముందు వేసిన లేఅవుట్లను 14 శాతం ఓపెన్ స్పేస్ చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని ఆయన సూచించారు. నాన్ లే అవుట్లు ప్లానులు తయారు చేయించుకుని 50శాతం లేదా రూ. పది వేలు తగ్గకుండా చెల్లించి 90 రోజుల్లో యాజమాన్యపు హక్కులు పొందాలని తెలిపారు. ఖాళీ స్థలాలకు వెంటనే పన్నులు చెల్లించాలని కోరారు.